క్లుప్తంగా

మంత్రిని విమర్శించే హక్కు లేదు

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్



దుబ్బాక: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను విమర్శించే నైతిక హక్కు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా సేవచేసిన మంత్రి సురేఖను ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే విమర్శలు చేయడం సరి కాదన్నారు. పదేళ్లుగా సిద్దిపేట నాయకుల పెత్తనంలో దుబ్బాక వెనుక బడిందన్నారు. దుబ్బాక నియోజక వర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిద్దిపేట వారిని తొలగించి దుబ్బాక ప్రాంతంలోని నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

పట్టణ అభివృద్ధికి సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని స్ఫూర్తి అసోసియేషన్ ప్రతినిధి బృందం తెలిపింది. ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవీ కాలం ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా పనితీరు, ఇచ్చిన హామీలపై ఆదివారం స్ఫూర్తి అసోసియేషన్ కార్యవర్గం చర్చించింది. పట్టణ అభివృద్ధి కోసం మంత్రి తీసుకుంటున్న నిర్ణయాలపై అందరి సలహాలు కోరడం స్వాగతిస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. త్వరలో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి వర్క్‌షాపు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. సమావేశంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, కార్యదర్శి అనగోని తిరుపతి, ప్రతినిధులు మల్కిరెడ్డి మోహన్ రెడ్డి, గౌరిశెట్టి వీరేశం, నోముల చంద్రారెడ్డి, గాజర్ల మోహన్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత దుబ్బాక



నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

దుబ్బాకటౌన్: 15 రోజులుగా చిన్న గుండవెల్లిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో దుబ్బాక ఎంసీఎఫ్ టీం విజేతగా నిలిచింది. ఆదివారం దుబ్బాక ఎంసీఎఫ్‌కు లింగారెడ్డిపల్లి టీంకు మధ్య ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లింగారెడ్డి పల్లి టీం నిర్ణీత 12 ఓవర్లలో 102 పరుగులు చేసింది. 103 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంసీఎఫ్ టీం నాలుగు బాల్స్ మిగిలి ఉండగానే 7 వికెట్లతో తేడాతో లక్ష్యాన్ని ఛేదించింది. అనంతరం నిర్వాహకులు విజేత ఎంసీఎఫ్ టీంకు రూ.30 వేల నగదు బహుమతి, కప్పు అందజేశారు. ఫైనల్ మ్యాచ్ వీక్షించడానికి పలు గ్రామాల నుంచి యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

సంప్రదాయాలను కాపాడాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కళాకారుల పౌరాణికం, జానపద, మహిళా కోలాటాలు, సాంస్కృతిక జాతర ఆదివారం పట్టణంలోని సంఘమిత్ర బీఈడీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లుగా హుస్నాబాద్ కావాలన్నారు. జనం నుంచి వచ్చిందే జానపదమని, కళలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కళాకారులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ యాదగిరి పాల్గొన్నారు.

చెరువు మట్టి.. పంటకు పుష్టి

భూమి సారవంతంగా ఉంటేనే పంటల దిగుబడి బాగుంటుంది. చెరువు మట్టితో పొలంలోని తేమ దెబ్బతినకుండా ఉంటుంది. సూక్ష్మ పోషకాలు కూడా అధికంగా ఉంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వాతావరణ కాలుష్యం తగ్గడంతోపాటు భూమి ఉత్పాదక శక్తికి కలిగి ఉంటుందంటున్నారు. దీంతో ఉపాధి హామీ పనుల తీసిన చెరువు మట్టిని రైతులు పొలాల్లో చల్లుకుంటున్నారు.

- భూసారం ఉంటే దిగుబడులు అధికం
- పొలాల్లో చెరువు మట్టి చల్లుతున్న రైతులు
- సూక్ష్మ పోషకాలు అధికమంటున్న అధికారులు



ఆకునూరులో పొలంలో చల్లిన చెరువు మట్టి

చేర్యాల(సిద్దిపేట): రైతులు పంట దిగుబడి పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సాగుకు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. నేలను సారవంతం చేసేందుకు దక్కి దున్నడం, చెరువు మట్టి చల్లడం వంటి పనులు చేపట్టారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకంతో పొలాల్లోని తేమ దెబ్బతిని, మిత్ర పురుగులు, పోషక విలువలు తగ్గి తద్వారా సాగుకయ్యే పెట్టుబడి పెరిగి ఆశించిన దిగుబడులు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాగు ఖర్చు తగ్గించుకునేందుకు రైతులు ఇటీవల గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో చెరువుల్లో తీసిన పూడికమట్టిని పొలాల్లో చల్లి భూసారాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా చెరువుల నుంచి తరలించిన ఒండ్రు మట్టిలో ఉండే పోషకాలు పంట దిగుబడికి ఎంతో దోహదపడతాయి. ఇదే కాకుండా కొంత మంది రైతులు గ్రామాల్లో తమ వ్యవసాయ బావుల వద్ద నిల్వ చేసిన పశువుల ఎరువును పొలాల్లో చల్లుతుంటారు. ఇలా చేయడం వల్ల రైతులు నష్టపోకుండా పంట దిగుబడులు పెరిగి లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

పోషకాలు అధికం



చెరువు మట్టిలో సూక్ష్మపోషకాలు అధికంగా ఉంటాయి. పొలాల్లో చెరువుమట్టి వేయడం వల్ల మొక్కకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, కాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, జింకు వంటి పోషకాలు తగు మోతాదులో అందుతాయి. తద్వారా వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. భూసారం, నేల ఉత్పాదక శక్తి పెరుగుతుంది.

– ఎండి అఫ్రోజ్, మండల వ్యవసాయ అధికారి, చేర్యాల

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



కోహెడ క్రాసింగ్ వద్ద సాగుతున్న రోడ్డు పనులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కోహెడ క్రాసింగ్ నుంచి మండల కేంద్రానికి చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రం నుంచి వెంకటేశ్వరపల్లి మీదుగా సిద్దిపేట నుంచి వరంగల్ రోడ్డును కలిపే లింక్ రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. దీంతో రాకపోకలు సాగించేందుకు మండల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు విస్తరణకు రూ.15 కోట్లు కేటాయించారు.

రాజీనామా చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ2.లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా లేఖతో సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోపిడీ చేసిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు రుణమాఫీ చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. రుణమాఫీకి రూ.31వేల కోట్లు ప్రభుత్వం కేటాయించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెరుకు విజయ్‌రెడ్డి, చేగుంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంగళరావు, నాయకులు విజయ్‌పాల్‌రెడ్డి, సాబేర్ పాల్గొన్నారు.

సేవాలాల్‌సేన సంఘ జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్ నాయక్



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్‌నాయక్

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం హనుమతండా గ్రామ పంచాయతీకి చెందిన బాధావత్ శ్రీనివాస్ నాయక్ సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు బానోతు రాజునాయక్ పాల్గొన్నారు.

రుణమాఫీ హర్షణీయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల ఏకకాల రుణమాఫీకి మంత్రి మండలి తీర్మానం చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించిన సీఎం రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



దుబ్బాకలో శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దుబ్బాక: అఖండ భారతావని, దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రాణాలర్పించిన గొప్పనేత భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం దుబ్బాకలోని ఎంపీ రఘునందన్‌రావు క్యాంపు కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖర్జీ కోరుకున్నట్లుగా ఆర్టికల్ 370ని నరేంద్రమోదీ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది ముఖర్జీకి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివప్రసాద్‌గౌడ్, సుంకోజి ప్రవీణ్, భాస్కర్, రమణారెడ్డి, రవీందర్, సప్తగిరి, నేహాల్‌గౌడ్, యాదగిరి, బద్రీ, రాజు తదితరులు ఉన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ మండల నాయకులు ఆదివారం బెజ్జంకిలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, ప్రధాన కార్యదర్శి అనిల్‌రావు, బుర్ర మల్లేశం, దొమ్మాటి రాములు, తూముల రమేష్, రామచంద్రం, సునీత, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: కాశ్మీర్ భారత్‌లో శాశ్వత అంతర్భాగంగా నిలిచిపోవడానికి తన ప్రాణాన్ని త్యాగం చేసిన డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిరస్మరణీయుడని బీజేపీ నాయకులు అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ 71వ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం పట్టణంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్ అన్నారు. జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కుకునూరుపల్లిలో..

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని ఆదివారం పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని గజ్వేల్ బీజేపీ నేతలు కొనియాడారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తం అమలు చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



గజ్వేల్‌లో మాట్లాడుతున్న శంకర్

గజ్వేల్‌రూరల్: అంబేడ్కర్ అభయ హస్తం పథకానికి మార్గదర్శకాలను రూపొందించి వెంటనే అమలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం స్థానంలో అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, స్వామి, రాజు పాల్గొన్నారు.

వితంతువులపై వివక్ష చూపొద్దు



పందిల్లలో నినాదాలు చేస్తున్న మహిళలు

బాల వికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిర్మల

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో వితంతువులపై సాటి మహిళలు వివక్ష చూపితే వారు మానసికంగా కుంగిపోతారని బాల వికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిర్మల అన్నారు. ఆదివారం అంతర్జాతీయ వితంతు దినోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మహిళలు తోటి మహిళలను గౌరవిస్తే సమాజంలో పురుషులతో సమానంగా గౌరవింపబడతారన్నారు. వితంతువులను శుభకార్యాలకు ఆహ్వానించకుంటే వారిపై వివక్ష చూపడమేనన్నారు. ఐక్యతతో ముందుకు సాగితే సమాజంలో సమాన హక్కులు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జ్యోతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి సంగాపూర్‌లోగల మదర్సా (జమియాతుల్ హక్ రెసిడెన్షియల్)లో విద్యార్థులకు బోధించేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మదర్సా చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ ఆదివారం తెలిపారు. ఈవీఎస్, బయోలాజికల్ సైన్స్, ఇంగ్లీష్, హిందీ, గణిత శాస్త్రం, భౌతికశాస్త్రంతో పాటు పీఈటీ, క్లర్క్ అండ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు.
అర్హతగల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా సంగాపూర్‌లోని మదర్సాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94927 25063, 91002 87107, 99513 65909 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల అనారోగ్యంతో మండల పరిధి ముస్త్యాల గ్రామానికి చెందిన తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కో కన్వీనర్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ మేరిండ్ల శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను గౌడ ఎంప్లాయిస్ సర్వీస్ సొసైటీ సభ్యులు పరామర్శించి రూ.16 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అంబాల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి అంబటి సిద్ధయ్యగౌడ్, ట్రెజరర్ బాలభాస్కర్, ఉపాధ్యక్షుడు బూరుగు కనకయ్య, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్‌లో సోమవారం నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య కోరారు. ఆదివారం మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామంలో మాట్లాడారు. కోహెడ ప్రాంత యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర యువజన సర్వీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు చదువుకున్న వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుతుందన్నారు. విదేశాలకు వెళ్లాలనే ఆసక్తి ఉన్న యువతకు రాబోయే కాలంలో తగిన శిక్షణ ఇస్తామన్నారు. హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు గ్రామ మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాండ్ల పెద్ద తిరుపతి, ఉపాధ్యక్షుడిగా గాండ్ల తిరుపతి, కార్యదర్శిగా గాండ్ల బాలయ్య ఎన్నికయ్యారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు తిరుపతి సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

బోనాల పండుగ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో ఆదివారం గ్రామ దేవతల బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



సికింద్లాపూర్‌లో బోనాల ఊరేగింపు

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం**

హుస్నాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి రుద్రారం రమేష్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఆదివారం సైదాపూర్ మండలం బొమ్మకల్ వెళ్లి మృతి చెందిన స్నేహితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

◆ **గ్రూప్ 1 అభ్యర్థులకు ఉచిత శిక్షణ**

బెజ్జంకి(సిద్దిపేట): గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన సివిల్స్ సలహాదారు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి ఆదివారం తెలిపారు. పరీక్షపై అవగాహన కల్పిస్తామన్నారు. వివరాలకు 94418 08065 నంబర్‌కు ఫోన్‌చేసి సంప్రదించాలని సూచించారు.

◆ **కొండపోచమ్మకు భక్తుల రద్దీ**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని శ్రీ కొండపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు ఉదయం కొండపోచమ్మను చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సెలవు రోజు కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. నిర్వాహకులు దర్శన ఏర్పాట్లు చేశారు.

◆ **ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధి నాగపురి శివారులోని నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు నల్లపోచమ్మ ఆలయ చైర్మన్ గూడెపు మహేష్ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆలయ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకునేలా దేవాదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థినికి గోల్డ్ మెడల్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2023–24 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని గోల్డ్ అందుకున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ మీడియం) సిద్దిపేట హెచ్‌ఎం అఫ్జల్ ఆదివారం తెలిపారు. మదీనా ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి లో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన విద్యార్థి అయిషా సిద్దిఖీకి బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నట్లు వెల్లడించారు.

◆ **రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక**

హుస్నాబాద్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా హుస్నాబాద్‌కు చెందిన సీనియర్ రిపోర్టర్ నన్నె అజయ్ కుమార్ ఎన్నికయ్యాడు. ఖమ్మంలో జరిగిన యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. నూతన కౌన్సిల్ సభ్యుడిని సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రంగాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి అరుణ్‌కుమార్ అభినందించారు.

◆ **ఉచిత వైద్యశిబిరం**

నంగునూరు(సిద్దిపేట): సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్ కుమారస్వామి అన్నారు. సిద్దిపేటకు చెందిన ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకులు ఆదివారం పాలమాకులలో చిన్నపిల్లల వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ నిహార్ 45 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులంతా ఒక్క చోట కలుసుకొని సందడి చేశారు. చదువు కున్న రోజులను గుర్తు చేసుకున్నారు. పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో రోజంతా గడిపారు.



పాములపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన 1990-91 బ్యాచ్ విద్యార్థులు



గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



సలాఖపూర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-24 బ్యాచ్ విద్యార్థులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990